# ఇరవైఏళ్ళ తరువాత...

ఆర్. యం. చిదంబరం



నరసింహం దగ్గర్నుంచి వుత్తరం వస్తుందని, జగన్నాథం కల్లోకూడా అనుకోలేదు.

.. అందులోనూ ఇరవై సంవత్సరాల తరువాత ! .

గతానికీ, వర్తమానానికీ మధ్య వంతెనలా ఆ వుత్తరం !

మనస్సంతా ఒక్కసారిగా మొద్దుబారటం వలన, రెండు నిమిషాలపాటు రాతి బొమ్మలా కూర్చుండి పోయాడు. ఇంత కాలంగా గతాన్ని మర్చిపోదామని విశ్వ ప్రయత్నాలుచేసి, విజయపుటంచుల్ని చేరుకున్న తను మళ్ళీ సముద్రంలోకి విసిరి వేయబడ్డాడు.

నరసింహం రాశాడు :-

'నువ్వు కులాసాగా వున్నావని నమ్ముతున్నా నిన్ను చూట్టానికి ప్రయత్నించక పోవటం వలనకాని, వుత్తర ప్రత్యుత్తరాలు జరపనందువలన కాని, నిన్ను మర్చిపోయానని ఎన్నడూ అనుకోకు నిన్ను తలచుకోని రోజు లేదు జగన్నాథమనే పెదనాన్న వున్నాడని మాలతితో కూడా చెప్పాను మనిద్దరికి తెలిసిన కారణాలచేత, నీ వునికి తెలియదని అబద్ధమాడాను లేకపోతే, నా అవుసరం, అనుమతి లేకుండా తనే స్వయంగావచ్చి నిన్ను చూసేదేమో! . దాని మనసలాంటిది . అచ్చం సీతలాగే ననుకో ! ఈ వుత్తరం ఎందుకు రాస్తున్నానంటే, మాలతికి రేపు పెళ్ళి. ముహూర్తం వేళకన్నా నువ్వు వస్తావని నా ధృఢ విశ్వాసం పెదనాన్నను, పెద్దమ్మను చూడొచ్చని మాలతితోకూడా చెప్పాను. ఎక్కడ వున్నారో తెలియదని ఎందుకు బొంకావని నిలదీసి అడుగుతుందేమోనని భయపడ్డాను కాని నూతన జీవితంలో అడుగు పెట్టే వుత్సాహంలో ఆ సంగతి మరచిపోయింది. పెదనాన్న వెలరోజులైనా యిక్కడ వుండాలంది.. మీ రిద్దరూ తప్పకుండా రావాలి నాకు ఆశాభంగం కలిగించకు నీకు మళ్ళీ ఏమన్నా పిల్లలా? . ఆ శుభవార్తకూడా వీనుల విందుగా రేపు వినిపించి, కనులవిందుగా కనుపిస్తుందనుకుంటాను నాకు మాలతి ఒక్కర్తేననుకో,. అది సౌభాగ్యంతో చల్లగా వుంటే అదే చాలు . తతిమా వివరాలు వేరుగా ... నా అడ్రసు కింద రాస్తున్నా ..'

జగన్నాథం శుభలేఖ చూశాడు.

ముహూర్తం పది గంటలకు . పెళ్ళి కొడుకు ఎం బి బి యస్ డాక్టరు—

'మాలతి అదృష్టవంతురాలు' అని ఒకటికి పదిసార్లనుకున్నాడు.

ఏదో తన కూతురికి పెళ్ళి జరగబోతున్నట్టు సంబరపడ్డాడు

ఓ మూలపడి మూలుగుతున్న గడియారం అయిదున్నరంది.

అంటే, రామాపురంపోయే ఎక్స్‌ప్రెస్ బండికి రెండున్నరగంటల వ్యవధిమాత్రమే వుందన్నమాట! అది రేపు ఉదయం తొమ్మిదిన్నరకు చేరుకుంటుంది.

ముహూర్తానికి అందుకో[illegible]

లార అక్షింతలు వేయొచ్చు:

నరసింహం కోరికను మన్నించక తప్పదు.

జగన్నాథం ఆవుత్తరంమడచి జాగ్రత్తగా పర్సులో భద్రపరిచాడు. పెట్టెతెరచి, ఆనెల జీతంలో ఖర్చులు పోగా మిగిలిన యాభై రూపాయలు తీసుకున్నాడు.

ఇరవై సంవత్సరాల తరువాత తను చూడబోతున్న మాలతి — పెళ్ళికూతురు మాలతి—ఎలా వుంటుందోనని వూహాగానాలు చేశాడు...

అన్నట్టు, పెళ్ళికి వట్టిచేతులతో వెడితే ఎలా ? దారి ఖర్చులకు ఇరవై రూపాయలుపోను, మిగతా ముప్పైఫ రూపాయలలో ఏంకొనటం ?

జగన్నాథం ఆలోచనలో పడ్డాడు.

సిల్కుచీర ?...వద్దు వద్దు ... మాలతికి పట్టుచీరలు కోకొల్లగా వచ్చి పడతాయి...మిట్టమధ్యాన్నపు సూర్యుడిముందు చిన్న మానెదీపంలా తన కానుక... వెండి గిన్నె...పట్టు రవికగుడ్డ...ఎవర్‌సిల్వర్‌లో ఏదైనా...అబ్బే ... ఆయనకేదీ నచ్చలేదు. చివరికి ఓ నిర్ణయానికి వచ్చి గబగబ సంచీలో బట్టలు సర్దుకున్నారు. ఉన్న వాటిలో రెండు మంచిపంచెలు...ఓ ఖద్దరు చొక్కా—ఉత్తరీయం...చొక్కా కుబొత్తాలు రెండే వున్నాయి. అయినా ఫరవాలేదు. దారిలో కొనుక్కోవచ్చు...లేకపోతే బండిల్లో, వందమంది లక్షన్నర సామాన్లు అమ్మటానికి వస్తారు. అందులో ఈ అల్పవస్తు వుండకపోతుందా ఏవిటి ? ... పొద్దున్న వండిన అన్నం మేకుల్లావున్నా, మజ్జిగ పోసుకుతిని, తలుపు తాళంవేసి బయలుదేరారు.

వద్దనుకున్నా, గతం ముందుకువచ్చి, 'నన్ను మరవలే' వంది.

*　　*　　*

జగన్నాథం ఎలిమెంటరీ స్కూలుటీచరు. నరసింహం తాలూకాఫీసులో గుమస్తా — ఆర్థికంగా మాత్రమే కాక, గుణగణాల్లో కూడా యిద్దరూ సమానస్థాయిలో పయనించారు. ఎదురెదురిళ్ళల్లో వుంటూ తమ స్నేహితాన్ని మరింత దృఢతరం చేసుకున్నారు. నరసింహం, జగన్నాథంకంటె పదేళ్ళు చిన్న — ఎక్కడైనా, బయట ఏ ఒకర్ని ఒంటరిగా చూసినా దారిన పోయేవారు ముక్కుమీద వేలేసుకునేవారు.

'ఇద్దరికీ అంతటి అనుబంధం...పొత్తు:

జగన్నాథానికి సంతానంలేదు. కలుగుతుందన్న ఆశ కూడా చిగర్చటం మానుకుంది.

నరసింహానికి ఒక్కగా నొక్క కూతురు సీత. ఆ తరువాత పది సంవత్సరాలు దొర్లినా, ఆమెకు పోటీగా తమ్ముడుకాని, చెల్లెలుకాని పుట్టలేదు.

సీత బుద్ధిమంతురాలు— సూక్ష్మగ్రాహి. చురుగ్గా, చక చకా, లేడిపిల్లలా గంతులేస్తూ క్షణం తీరికలేకుండా తిరిగేది. క్లాసులో ఫస్టు...

అందంలో నూటికి నూరు — ఎప్పుడూ జగన్నాథం యింట్లోనే వుండేది. ఆయన దగ్గర్నుంచి సంస్కృతశ్లోకాలు అర్థసమేతంగా నేర్చుకునేది. భగవద్గీత...భాగవతం కరతలామలక మైంది. ఒక్కరోజు ఆమె కనిపించకపోతే దంపతులు తల్లడిల్లిపోయేవారు. ఒకసారి, సీత ఎవరో బంధువుల పెళ్ళికి పొరుగూరు వెళ్ళి రెండురోజుల దాకా తిరిగిరాలేదు ... తనభార్య ఆ రెండు రోజులూ పస్తు పడుకుందని నరసింహంతో చెప్పకుని జగన్నాథం పగలబడి నవ్వాడు. ఒక్కొక్కప్పుడు సీత జగన్నాథం కూతురేమోననికూడా నరసింహం అనుకునేవాడు.

ఆర్థికంగా సంఘంలో తనకున్నస్థితిని గుర్తించ గలిగింది ఒక్క నరసింహం మాత్రమే. చిన్నచిన్న వ్యాపారాలుచేసి కొద్దో గొప్పో గడించసాగాడు. జగన్నాథాన్ని కూడా తన త్రోవలోకి తీసుకురావాలని విశ్వప్రయత్నం చేశాడు.

'వాకూ వ్యాపారానికీ పడదోయ్!... అయినా డబ్బుకూడ బెట్టుకుని నేను చేసేదేముంది? పిల్లాజెల్లా?...నీసంగతి వేరు— సీతకు ఆనాటి జనకమహారాజు చేసినట్టు వైభవంగా పెళ్ళిచేయనక్కర్లేదా? ... అందుకుని ఖజానా, తద్దినం బ్రాహ్మడి బొజ్జలా పెద్దది కావలసిందే!'

ఈమాటలు విన్న నరసింహం విరగబడి నవ్వాడు.

'భలేవాడివే నువ్వు ... అయితే మాసీత కూడా అరణ్యవాసంచేసి, లంకకు వెళ్ళి అన్నికష్టాలూ అనుభవించా లంటావా?...'

జగన్నాథంకూడా నవ్వాడు.

సీతకూడా ఆమాటలు విన్నట్టుంది.

'పెద్దన్నగారు తోడువస్తే అరణ్యమేమిటి? ... సముద్రాన్నికూడా దాటేస్తా' అంది.

జగన్నాథం కళ్ళు చెమర్చాయి.

అతని ఆప్యాయత చూసిన నరసింహం కూడా కళ్ళు తుడుచుకున్నాడు.

చల్లగావుండే వాళ్ళనుచూస్తే మనుషులకేకాక, దేవుడిక్కూడా కళ్ళు కుడతాయి కాబోలు!...

కాకపోతే ఆనాటి సంఘటన!...

ఝల్లుకుంటోనే శరీరమంతా గడగడలాడుతోంది. మెదడు మొద్దుబారి ఆలోచించటం మానుకుంది.

ఆ రక్తపుమడుగు—ఆర్తనాదం—గుండెలు బ్రద్దలయ్యేలా ఏడుపులు— తలలు బాదుకోటం...

అమ్మో!...వద్దు...ఆలోచించవద్దు గతం మహా చెడ్డది.

జగన్నాథం మరింత త్వరగా నడవసాగారు.

బజారు చేరుకొనేసరికి ఏడు కావస్తోంది. అనుకున్న ప్రకారం మాలతికి బహుమతి కొనిక్కుని స్టేషను చేరుకునేసరికి ఏడున్నరైంది.

రైలు మరో అరగంటకు వచ్చేస్తుంది.

ఆ బహుమతిని ఆదరంగా ఒకటికి పది సార్లు పరీక్షగా చూశారు. తను ఎంచుకున్న వస్తువు సరైందా కాదాని తనకి తాను వాదించుకుని 'సరే'నని తృప్తిపడ్డారు. టిక్కట్టు తీసుకుని ప్లాటుఫారం మీదకు వచ్చారు.

రైలు సరిగ్గా సమయానికి వచ్చింది.

'ఇదొక శుభసూచన... ముహూర్తానికి అందుకోగలను' అనుకున్నారు

రైలు వెలుగును విడచి, చీకట్లోకి పరుగెత్త సాగింది.

ఆపెట్టెలో ఎక్కువమంది ప్రయాణీకులు లేరు. ఆయనకూర్చున్న బెంచిలో మనిషి, రైలు కదలగానే పైకిపోయి నిద్రకోసం తపస్సు ప్రారంభించాడు.

జగన్నాథం కూడా నడుం వాల్చాడు. కాలాన్ని చంపేందుకు నిద్రకంటె వుత్తమమైన ఆయుధం లేదు. కాని, బలవంతంగా కళ్ళుమళ్ళీ గతంలోకి వెళ్ళాయి.

బెజవాడలో తమ్ముడి దగ్గరుంటున్న చెల్లాయికి పెళ్ళి నిశ్చయమైంది. జగన్నాథం భార్యతో బయలుదేరాడు.

'పెదనాన్నా !...ఎక్కడికి పయనం ? నాతో చెప్పకుండా వెళ్ళిపోతున్నారుకదూ ! ...మీకూ, నాకూ యిక మాటల్లేవు.' అని సీత బుంగమూతి పెట్టింది

జగన్నాథం సంగతి వివరించాడు.

'బెజవాడ చూడాలని నేనుకూడా ఎంతో సరదా పడుతున్నా. కృష్ణానదిమీది వంతెన, రైలు పరుగెడుతుంటే అటూ యిటూ కదులుతుందటగా ! ... అది చూడాలి ... కొండమీది అమ్మవారిగుడి ... పట్నం కదా...ఇంకా ఎన్నో వింతలుంటాయి ...నన్నుకూడా తీసికెళ్లండి పెదనాన్నా ! పెద్దమ్మా ! నువ్వన్నా నచ్చజెప్పవూ ?' అంటూ బతిమాలింది.

'దాన్నికూడా రానివ్వండి ... ఈ అయిదారు రోజులు దాన్ని చూడకుండా ఎలా వుండగలనోనని, నా కప్పుడే బెంగగావుంది.' అంది పెద్దమ్మ.

'నాకూడా అంతే ననుకో ... కాని ఎలా!? ... మీ నాన్న ఒప్పుకోడు పెద్దయ్యాక వెళ్లొచ్చు...మీ నాన్నతో చెప్పి నీకు బెజవాడ మొగుణ్ణి తెమ్మంటానులే !... ప్రస్తుతానికి అల్లరి చేయకు... క్లాసులో పాఠాలుకూడా పోతాయి' అని సముదాయించటానికి యత్నించారు.

సీత ఏడుపు లంకించుకుంది.

'సరే !...నీ నాటకం కట్టిపెట్టు ... జగన్నాథం !...నీ కూతుర్ని ... అవును... నీ కూతుర్ని నీతో తీసికెళ్ళు బాబూ!... బెజవాడలోనే వదిలేసి వచ్చెయి. తిరిగిరానక్కర్లేదు ... పెంకిపిల్ల' అన్నాడు నరసింహం.

'ఓస్...నాకేం భయం లేదు. అక్కడే హాయిగా ఏదైనా పెద్దబడిలో చదువుకుంటాను. ఈ వూరు నాకేం నచ్చలేదు' అని ఎదుర్కొంది సీత.

అందరూ నవ్వులో మునిగిపోయారు.

జరిగినదంతా నెమరు వేసుకుంటున్న జగన్నాథానికి కన్నీరు ఆగిందికాదు.

'బాలవాక్యం బ్రహ్మవాక్య మంటారు... తిరిగిరానని సరదా కంది నిజంగానే తిరిగి రాలేదు.' అని కుమిలి కుమిలి ఏడ్చాడు.

పెట్టెలోని ఒకరిద్దరు ఆయనవంక జాలిగా చూశారు.

'ఏం కష్టం వచ్చిపడిందో ఏమో!...ముసిలాడు!' అనుకున్నారు.

# ఇరవై ఏళ్ల తరువాత...

చెల్లెలు పెళ్లైనతరువాత సీతను తీసుకుని బెజవాడంతా చూపించటానికి బయలుదేరాడు. ముచ్చటపడ్డ కృష్ణవంతెన చూపి తిరిగి వస్తుంటే ఆ సంఘటన జరిగింది!

పొంచివున్న క్రూరమృగంలా ఓ నల్లటి కారు ఆమెను ఢీకొంది. మలుపు తిరుగుతుంటే సీత పదడుగులు ముందుకు పోయింది. దుడుకుతనం ఎక్కువ. పెదనాన్న కంటే త్వరగా ఇల్లుచేరుకోగలనన్న పంతం, ఒక్కసారి వచ్చినత్రోవ తనకు సుపరిచితమైందన్న విశ్వాసం—

సీత గట్టిగా కేకేసింది.

జగన్నాథం కొయ్యబారి పోయాడు. ఆయనగుండె ఆగిపోయింది ఏమీతోచలేదు.

ఏం జరిగింది—జరుగుతున్నది కూడా తెలియలేదు.

జనం పోగయ్యారు.

కొంచెం తేరుకునేసరికి సీతను వెనకసీట్లో వుంచుకుని, కారు బయలు దేరటానికి సిద్ధంగావుంది.

ఆయన లోపల అడుగుపెట్టగానే శరవేగంతో కదలిపోయింది.

జగన్నాథం ఆరక్తపు మడుగుచూసి గజగజలాడి పోయాడు.

సీత కెలాంటి గాయం తగిలిందో ఆయనకు తెలియదు. డ్రైవింగు చేస్తున్న ఆవ్యక్తినిచూశాడు...పాతికేళ్ల యువకుడు—శ్రీమంతుడిలా వున్నాడు ... ఏవిటో తన వెర్రి ఆలోచనలు! ... అతనెవరైతే తనకెందుకు?... సీతపాలిటి యముడు ... సీత ఎందుకో బతకదన్న భావం కలిగింది.

'అయ్యో! సీతా! ... నన్ను మోసం చేయకు ... నరసింహానికి నేనేం జవాబు చెప్పను ? భగవంతుడా! ... కావాలంటే నా ప్రాణం తీసికెళ్ళు. నా పరువు దక్కించు...నేను జీవచ్ఛవాన్ని — జీవితంలో నా కెలాంటి ఆశలు—కోరికలు లేవు. భవిష్యత్తు అసలే లేదు. నే నెందుకు బతికున్నానో నాకే తెలియదు...నరసింహం అలా కాదు ఇప్పుడిప్పుడే బతుకును తన బానిసగా చేసుకోటం నేర్చుకుంటున్నాడు. అతనికి సీత ఓ ఆరని దీపం. భగవంతుడా !... వద్దు ... వద్దు ... ఆమెను బతకనీ—'

అంటూ నెత్తి బాదుకున్నాడు.

కాని అనుకున్నదంతా జరిగితే జీవితానికర్థం లేదు. సంఘర్షణలు—ఆశాభంగాలు—ఓటమి—విజయం — అన్నీ వుంటేనే 'రేపు' మీద నమ్మకం వుంటుంది. హాస్పిటల్లో డాక్టర్లందరూ ప్రయత్నించి ఓడిపోయారు.

సీత పోయింది.

టెలిగ్రాం అందుకుని, నరసింహం దంపతులు వచ్చిపడ్డారు.

'నువ్వు హంతకుడివి ... నాకూతుర్ని చంపావు.' అని ఎగిరిపడ్డారు.

గుండెనిండా ఆవేదనను, దుఃఖాన్ని ఎవరో ఒకరిమీద, ఏదోవిధంగా మళ్లించకపోతే అతనుకూడా సీతను వెంబడించవలసిందే!

జగన్నాథం తలవంచుకుని, నిలబడ్డాడు. నరసింహం తన్ను పీకపిసికి చంపినా బాగుండు ననిపించింది

'కన్న కడుపుకుకాని ఈ బాధ అర్థం కాదు...నువ్వూ కనబోతున్నావు ... నీకూ ఈ గతేపట్టి అనుభవిస్తావు.' అని శపించే ధోరణిలో అన్నాడు. అవును.

చిరకాలం తరువాత కల్లోకూడా ఆశించని ఆ శుభదినం ఇంకా మూడు నెలల దూరంలో వుంది...జగన్నాథం తండ్రి కాబోతున్నాడు.

బెజవాడనుంచి తిరిగివచ్చాక నరసింహం జగన్నాథంతో మాట్లాడటం మానుకున్నాడు. జగన్నాథానికి అప్పుడప్పుడు ఆత్మహత్య చేసుకుందామనిపించేది... కాని ఏపాపం ఎరుగని తన భార్యకు, ఆపుట్టబోయే పసికందుకు దిక్కెవరు? వాళ్లకు అన్యాయం చేసేందుకు తనకు హక్కులేదు.

ఆయన్ని చూడగానే నరసింహం ముఖం అటు తిప్పుకున్నాడు.

'నరసింహం!...నేను కావాలని సీతను చంపలేదు.ఆ నిజం నీకు తెలుసు...విధి బలీయమని నీకు తెలియనిది కాదు. ప్రతిక్షణం అగ్నిగుండంలోపడి మలమల మాడిపోతున్నట్టుంది...రాత్రింబగళ్లు నిద్రలేదు... నాతప్పిదానికి ప్రాయశ్చిత్తం చేసుకుందామని వచ్చాను...' అంటూ అతనికాళ్ళు పట్టుకున్నాడు.

నరసింహం చివాల్నలేచి దూరంగా వెళ్ళి

నిలబడి ఆయన్ని కీటకంలా చూశాడు.

'జగన్నాథం!... ఈ టక్కరి వేషాలన్నీ ఎందుకు?...నీ స్నేహితం నాకక్కర్లేదు... నీదగ్గర్నుండి నేనేమీ ఆశించటం లేదు. నా సీత పోయినందుకు, నీ దగ్గర్నుండి నేనేమి రాబట్టుకోవాలని నువ్వనుకుంటు న్నావో నాకు తెలియదు... ఒకవేళ రొఖ్ఖ మేదైనా ముట్టజెబుతామనుకుంటున్నా వేమో!

జగన్నాథం మరో ఇరవైయేళ్ళు నెత్తి కెత్తి శివమాడుతున్నట్టు కృంగిపోయారు.

'రామ ! ... రామ ! ... నరసింహం ! అలాంటి మాటనకు. వివేకంతో మాట్లాడు నేను కావాలని సీతను చంపలేదని బాహా టంగా నువ్వు ఒప్పుకోకపోయినా, లోలోన గ్రహించే వుంటావు ... అదీకాక, ఇచ్చేం దుకు నా దగ్గర ఒప్పెక్కడుంది ?...

.. నేను ఓ విషయం చెబుదామని వచ్చాను...'

'నువ్వేం చెప్పనక్కర్లేదు ... నేను విన దల్చుకోలేదు. నీకూ-నాకూ ఎలాంటి అను బంధమూ లేదు. నీ ముఖం నాకు చూపిం చకు...మెడపట్టి గెంటేముందు, మర్యా దగా నువ్వే వెళ్ళిపో !...' అని గద్దించాడు.

జగన్నాథం తలవంచుకున్నాడు.

'ఏదో ప్రాయశ్చిత్త మంటున్నావు ... నా సీతను నాకు తిరిగివ్వగలవా ?...'

'ఇవ్వలేను...నువ్వేకాదు.. దేవుడు కూడా యివ్వలేడు. నాకు వెర్రెత్తించకు...' అనరిచాడు ... జగన్నాథం వెనోవంగా బయ టికి వచ్చాడు...

'ఎదురు బెంచీ మీద పడుకున్న ప్రయా ణికుడి చేతి వాచీలో పదైంది.

'బండి ఇప్పటికే గంట లేటు...' అన్నా రెవరో.

అలా రుద్రమూర్తిలా తాండవమాడిన నరసింహం తిరిగి తనతో జత కలుస్తా డని ఆయన ఎన్నడూ వూహించలేదు. కాని...

వెలరోజుల తరువాత నరసింహం తనం తట తనే వచ్చాడు.

జగన్నాథం రెండుచేతులూ పట్టుకుని, "నన్ను క్షమించు...సీత పోయిన దుఃఖంలో ఏదో అన్నాను. అవన్నీ మనస్సులో వుంచు కోకు. నువ్వన్నట్టు దీనికంతకూ ఎవరూ కారకులుకారు ... ఇంట్లో ఏ వస్తువు

# ఇరవై ఏళ్ల తరువాత...

చూపినా, దాని జ్ఞాపకం వస్తోంది. దాని బట్టలన్నీ కంటికక్కనపడని చోట దాచే సినా, ఎలాగో ఓ పట్టు పరికిణీ కన పడింది. ఆ రోజంతా ఏడుస్తూ కూర్చు న్నాననుకో... అది వేళకు తిండి తినటం మానేసింది... జగన్నాథం! నాకో ఆలోచన తట్టింది. అది ఎంతవరకూ సరైందో నువ్వు చెప్పాలి... నీ సలహా మీద నడచు కుంటాను... ఓ అనాథను పెంచుకుందా మనుకుంటున్నా. నాకింకా పిల్లలు పుడతా రన్న నమ్మకం లేదు...' అన్నాడు.

జగన్నాథం వెంటనే జవాబు చెప్పలేక పోయాడు.

'నరసింహం!... నాకు వారం రోజులు గడువియి. ఆలోచించి చెబుతాను.'

నరసింహం సరేనన్నాడు.

కాని మాలతి రాకతో నరసింహానికి, దిక్కులేని ఏ బిడ్డనో పెంచుకోవలసిన అవుసరం లేకపోయింది. జగన్నాథం కూడా, ఆ చిన్నారి పసికందు పెరిగి పెద్దదై, సీతకు మల్లే తన్ను విడవకుండా, ఆప్యా యత పెంపొందించుకుంటుందని ఆశతో ఎదురు చూశాడు.

కాని విధి మళ్ళీ వక్రించింది.

నరసింహం రామాపురం వెళ్ళిపోయాడు. అక్కడ ఓ మిల్లు కొన్నాడు. రెండుమూడు కంపెనీలలో భాగస్థుడుగా చేరాడు.

పోతూపోతూ ఓ చిన్న హెచ్చరిక విసిరి మరీ పోయాడు.

'చూడు జగన్నాథం!...దేవుడి దయవలన నాకు మాలతి దొరికింది. లేకపోతే నా ఎడారి జీవితమేమయ్యేదో!...నువ్వన్నట్టు ఎవరైనా పెంచుకున్నా, నాలుగూ తెలిసి వచ్చాక నేను తండ్రిని కానన్ననిజం తెలిసి పోతుంది ... అప్పుడు మనసులెలా మారు తాయో వూహించలేం...మాలతి ఇక్కడ పెరిగితే సీతలాగ హఠాత్తుగా నన్ను మోస గిస్తుందేమోనని నాకెందుకో భయంగా వుంది. ఈవూరు విడిచిపోవటానికది ముఖ్య కారణం...ఒక్కొక్కప్పుడు సీతను నువ్వే చంపావనిపిస్తుంది... ఆ భావాన్ని అణచుకో వాలని ఎంతో ప్రయత్నిస్తున్నాననుకో... ఇంతకూ నిన్ను కోరేదేమిటంటే, నువ్వు

నన్నూ, ఈ మాలతిని మర్చిపో— నావునికి తెలుసుకుని, నన్ను కలుసుకునేందుకు ప్రయత్నించకు... అలా చేస్తే నేను మంచి మనిషిగా వుండలేను ... సుహృదయంతో అర్థం చేసుకో— మనం స్నేహితులుగా విడి పోదాం...'

ఆనాడు విడిపోయిన మిత్రులు, ఇరవై సంవత్సరాలయినా కలుసుకోలేదు.

జగన్నాథం మిత్రుడి చివరికోరికను మనసులో రాతిలా పదిలపరచుకుని మన్నిం చారు ... మాలతినిమాత్రం ఆయన మరవ లేకపోయారు. పసికందుగా వున్నప్పుడు చూడడమేకాని, పెరిగిపెద్దయ్యాక ఎలా వుంటుందో తెలియదు ... కాలేజీలోకూడా చదివుంటుంది...

* * *

రైలు, రామాపురం పదిన్నరకు చేరు కుంది.

ముహూర్తం పదిగంటలకు — స్నానం చేసేందుకు సమయంలేదు. త్వరత్వరగా బట్టలు మార్చుకుని టాక్సీలో బయలు దేరాడు. డ్రైవరు మంచివాడుకనక, ఒక్క అరగంటమాత్రం, సందులు గొందులు తిప్పి, చివరకు ఓ పెద్ద బంగళాముందు ఆగాడు ... పదిరూపాయలు ఛార్జి తీసు కున్నాడు. అతను తన్ను మోసగించాడా లేదని ఆలోచించి నిర్ణయించేందుకు, కయ్యా నికి కాలు దువ్వేందుకు సమయం లేదు.

ముహూర్తం వేళ దాటిపోయింది... ఆశీ ర్వాదాన్నికన్నా అందుకోవాలి.

కళ్ళెత్తి ఆసుందరభవనం వంకా చూశా క్కాని మాలతి జీవితంలో ఎలాంటి ఔన్న త్యాన్ని అందుకోగలిగిందో ఆయన సరిగ్గా లెక్క తేల్చుకోలేకపోయారు.

రంగురంగుల తోరణాలు గాలికి రెపరెప లాడుతున్నాయి. పెళ్ళికళ వున్నా, పరి కొత్తగా లేదు... ఎందుచేతనో ఏమో!...బాజా భజంత్రీల ఆమాకీ లేదు. కాంపౌండు నిండా పెద్దపెద్ద రంగురంగుకార్లు...పచ్చిపోయే పెద్దమనుష్యులు పట్టుచీరల తళతళలు— మెరిసిపోయే రాళ్ళదుద్దులు...నెక్లెసులు... ఉంగరాలు ... సంబరమంతా ఒకచోటచేరి చప్పట్లు చరచినట్టు గలగలమనేనవ్వులు... అలా వూహిస్తూ జగన్నాథం కాంపౌండు గోడదాటి లోపల అడుగుపెట్టారు. ఆయన ఎదురుచూసిన ఏ ఒక్కటీ కనిపించలేదు...

కనిపించలేదు!

అక్కడక్కడే ఒకరిద్దరు మనుష్యులు మాత్రం తొందరతొందరగా నడుస్తూ కనిపించారు.

ఒకవేళ టాక్సీవాడు పొరపాటుగా మరో యింటో వదలి పోలేదుకదా!

అంతా అయోమయంగా కనపడింది.

ఐశ్వర్యంతో గర్వంగా నవ్వుతున్న ఆవాతావరణంలో ఆయన తృణప్రాయంగా తన్ను అంచనావేసుకుని సిగ్గుపడ్డాడు. పంచె కున్నకుట్లు కనపడకుండా అతి జాగ్రత్తగా గోచి పోసికట్టుకున్నా, బయటికనిపిస్తా యేమోనని బెంగగానే వుంది.

ఉన్నట్టుండి ఆయన కళ్లు చెమ్మగిల్లాయి

'అవును ... మాలతి అదృష్టవంతురాలు!...అయితే నాకెందుకీ ఆనందం? సీత మీది అనురాగం నన్నిలా పలికిస్తోంది గావాలు!... అనుకున్నారు యాభై గజాలు నడిచాక హాలుదగ్గరకొచ్చి ఆగిపోయారు.

ఓ యువకుడు తీరిగ్గా సిగరెట్టు కాలుస్తూ, ట్రాన్సిస్టర్ సంగీతం వింటూ తన్మయుడవుతున్నాడు.

ఆయన్ని ఎగాదిగా చూసి 'ఎవరు కావాలి మీకు?...' అనడిగాడు!

'ఒకవేళ ఇతనే మాలతి భర్తేమో!... ఛ అదెలా అవుతుంది?' అనుకున్నారు.

'ఏది నరసింహం ఇల్లేనాండి?...'

'ఇల్లేవిటండి? ..భవనం అనండి...అవును. ఆయన స్వంతంగా కట్టిన భవంతి...నరసింహ భవనం!' అంటూ ఏదో 'విట్' విసిరినట్టు పెద్దగా నవ్వాడు.

'అతని కూతురు మాలతి పెళ్లి...'

'అవును...జరిగిపోయింది. అసలు మీరెవరు?...రండి...ఇలా కూర్చోండి' అంటూ ఓ కుర్చీ చూపించాడు. జగన్నాథానికి ఏదో అర్థంకాని భయం వేసింది.

'అతని స్నేహితుణ్ణి ... నాపేరు జగన్నాథం...మేం విడిపోయి ఇరవై సంవత్సరాలు కావస్తూంది... కూతురు పెళ్లికి తప్పకుండా రావాలని రాశాడు...పెళ్లి ఇవేళ కదా!... ముహూర్తం పదిగంటలకని రాశాడు...పెళ్లి సందడి కొంచెం కూడా లేదే!'

ఐతేనే!...మీరు ఒక్కరోజు మాత్రం ఆలస్యంగావచ్చారండి .. అదంతా ఓ చిన్న కథ...ముందు రిఫ్రెష్‌మెంట్ కానివ్వండి... ఒరేయ్ వెంకన్నా!...కొంచెం కాఫీ, టిఫిన్ త్వరగా తీసుకురా!...పెళ్లికొడుక్కి తండ్రి లేడు. తాతే అతన్ని పెంచి పెద్దచేశాడు. మొన్న సాయంత్రము అందరూ ఇక్కడకు వచ్చారు...ఆ తాతగారికివున్నట్టుండి జబ్బు చేసింది. ఏదో గుండెలో నొప్పిలాంటిదనుకోండి. దాంతో ఆయన, ఈ ఒక్కగానొక్క మనవడి పెళ్లి చూడకుండానే కన్ను మూస్తారేమోనని పెళ్లి నిన్ననే జరిపేశారు. అదేం చిత్రమోకాని, ఆ మూడుముళ్లు పడగానే ఆయన వుక్కుముక్కలా లేచి కూర్చున్నారు. అందరూ ముక్కుమీద వేలేసుకున్నారు ..ఇంతకంటె చిత్రవిచిత్రమైన సంఘటనలు లోకంలో ఎన్నో జరుగుతుంటే, ఇందులో అలా నోరు తెరచుకుని కళ్లప్పగించి చూడవలసిన అవసరమేమీలేదని నేను మామూలుగానే వుండిపోయాను' కాఫీ, టిఫిన్లు వచ్చాయి.

ఆకలిగా వుండబట్టి కాఫీ అందుకున్నారు.

'ఇంతకూ మాలతి ఏది? నరసింహం కనిపించడేం? ... అమ్మాయిని చూసి నాలుగు అక్షింతలువేసి ఆశీర్వదిద్దామని ఇంత దూరం వచ్చాను.'

'చంపేశారు...ఆమాట ముందే అనకూడదండి?...మాలతి అత్తారింటికి-ఐమీన్-తాతగారింటికి పదకొండున్నర బండిలో వెడుతోంది...అప్పుడే పదకొండుంబావైంది. పదినిమిషాల్లో ఎలాగైనా స్టేషను చేరుకోవచ్చు...పదండి...ఈ పల్లెటూరి మనుష్యులంతా ఇంతే' అని కారువైపు పరుగెత్తాడు. జగన్నాథం కాఫీగ్లాసు అలాగే వుంచి అతన్ని వెంబడించాడు.

రైలు బయలుదేరటానికి రెండు నిమిషాలున్నదనగా స్టేషను చేరుకున్నారు.

ఆరైలు బయలుదేరే ప్లాటుఫారానికి వెళ్లాలంటే ఓవర్‌బ్రిడ్జిమీదుగా వెళ్లాలి.

యువకుడు జగన్నాథాన్ని లాక్కుంటూ పరుగెత్తాడు...

గార్డు విజిల్ వూదాడు.

'ఇంక లాభంలేదు ..అదుగో ... ఆఫస్టు క్లాసు కంపార్టుమెంటు దగ్గర చూడండి. ఈ జనసమూహాన్ని చీల్చుకుని మనం అక్కడ చేరుకునేలోగా బండి కదలిపోతుంది...'


జగన్నాథం ఆత్రుతగా చూశాడు.

ముందు నరసింహం కనిపించాడు. జుత్తు బాగా నెరసింది. మనిషిబాగా లావెక్కాడు. వేళ్లకున్న రాళ్ల వుంగరాలు ధగధగ మన్నాయి అతని కడుగుదూరంలో ఓ అమ్మాయి నిలబడుంది.

పొడుగ్గా, ఎర్రగా, అందంగా వుంది చూపుల్లో గాఢమైన గాంభీర్యం కనపడింది. ఆకుపచ్చ జరీఅంచు పట్టుచీర సూర్యరశ్మికి చిత్ర విచిత్రంగా మెరిసింది. మెళ్లో నగలు విలిపిగా నవ్వాయి.

'అవును ..ఆమె మాలతి!...'

'అచ్చం రతీదేవిలా వుంది!...' అనుకున్నారు జగన్నాథం.



అందరూ పెట్టెలోకి వెళ్ళిపోయారు. రైలు కదిలింది.

'నరసింహం కూడా వెడుతున్నాడా?...'

'అవును మరి ... ఒక్కగా నొక్క కూతురు — దంపతులు కూడా వెళ్ళి కూతురు కాపరం చేయటం కళ్ళారా చూసి తిరిగి వస్తారు.'

జగన్నాథం వుత్తరీయం నోటి కడ్డం పెట్టుకుని వెక్కి వెక్కి ఏడవ సాగారు.

'ఏమైందండి?...ఏమైంది?... ఆ తాత గారి లాగ మీక్కూడా ఏదన్నా వ్యాధి పట్టుకుందా ఏం?...' అని యువకుడు కంగారు పడ్డాడు.

జగన్నాథం ఏదో చెప్పాలని నోరు తెరవ బోయారు...

కాని ఎవరో నోరు నొక్కేశారు.

అవును...ఆ రహస్యం ఎలా బయట పెట్టగలడు? మాలతి తన కూతురని, నరసింహం కూతురు కాదని...సీత చావుకు —నరసింహం గుండె కోతకు—తను కారకు డనని, అందుకు ప్రాయశ్చిత్తంగా తన ఒక్కగా నొక్క సంతానాన్ని త్యాగం చేశా నని...చెప్పలేడు...చెప్పకూడదు.అంతేకాదు.. ఆమెను గురించి తలపెట్ట కూడదు. తనకూ, ఆమెకూ ఎలాంటి అనుబంధమూ లేదు. మాలతి కేవలం తన స్నేహితుడి కూతురు ... అంతే ... అసలు ఈ పెళ్ళికి

# ఇరవై ఏళ్ల తరువాత...

తను వచ్చి వుండకూడదు...తను మాలతిని త్యాగం చేయటం కూడా ఒకందుకు మంచి దైంది. తన దగ్గర వుంటే, ఎలిమెంటరీ స్కూలు మేష్టర్నో—ఆఫీసు ప్యూనునో— మరెవర్నో—పెళ్లి చేసుకునుండేది...ఇలాంటి వైభవాన్ని అనుభవించటం మాట అటుంచి, చూసేందుక్కూడా నోచుకునుండదు ... అంతా మన మంచికే నన్నారు.

'ఈ ముసిలాడు ఇలాగే గుండె ఆగి చస్తే నేనేం చేసేది భగవంతుడా?... ఇదేం పరీక్ష...' అని యువకుడు బెంబేలు పడి పోతున్నాడు.

జగన్నాథం ఏడుపు మాని, ధైర్యాన్ని తిరిగి తెచ్చుకున్నాడు.

'కంగారుపడకు నాయనా!..నాకేంలేదు... ఏదో మాలతిని చాలాకాలం తరువాత చూసిన సంతోషంలో కన్నీరు ఆగింది కాదు...నాకో చిన్న వుపకారం చేసిపెట్ట గలవా?'

'తప్పకుండా ... అలా ఆ బెంచీమీద కూర్చుందాం—పదండి—మీరు వున్నట్టుండి మూర్ఛపోతే ఏంచేసేది?'

'భయపడకు.. నాగుండెకాయిలాంటిది... అసలు రాయేననుకో...నేను ఈ తిరుగు బండికే మావూరు వెడుతున్నా'

'అదేమిటి? నరసింహంగారు మూడు రోజుల్లో తిరిగివస్తారు...ఆయన్ని చూడ కుండా వెళ్లటమేమిటి? ఆయన కీసంగతి తెలిస్తే నన్ను నిలువునా నరికేస్తారు... అదంతా కుదరదు...'

'అలాంటిదేం జరగదు... అతనికి నా తత్వం బాగా తెలుసు. అతనిమాట మన్నించి వచ్చానని చెప్పు... మాలతి పెళ్లి చూసే అదృష్టం లేకపోయింది...'

'సరేసరే!...ఇందాకా లోకంలో ఎన్నో విచిత్రాలు జరుగుతున్నాయన్నాను. ఇది అన్నింటికి మకుటంలా వుంది...'

'ఆమెకు బహూకరిద్దామని ఈ పుస్తకం తెచ్చాను. నరసింహానికిస్తే ఆమె కందజేస్తాడు.'

యువకుడు పుస్తకం అందుకుని పేజీలు తిరగేశాడు.

'మీకొంచెం జ్ఞానదృష్టిలాంటిది కూడా వుందనుకుంటాను ... మాలతి సంస్కృతంలో దిట్ట...ఆసంగతి మీకెలా తెలిసిందో మరి!'

జగన్నాథం నవ్వుకున్నారు. తనకు మాత్రం ఆ ప్రశ్నకు జవాబు తెలిస్తేగా!

'మరి నేను సెలవు తీసుకుంటాను... నీకు చాలా శ్రమిచ్చాను.. నన్ను క్షమించు.'

'మీరు పెద్దవారు ! ... అలా అన కూడదు ఇంతకూ మీరేవూరెళ్లాలి?...'

జగన్నాథం చెప్పాడు.

'పన్నెండున్నరక్కాని మీ రైలు రాదు. స్నానం అదీచేసి భోంచేసి వెళ్లండి— క్షణంలో తీసికెళ్ళి, క్షణంలో తీసు కొస్తాను. పెళ్ళింట భోంచేసినట్టూ అవుతుంది.

'వద్దునాయనా! ... కాఫీ తాగామగా!... చాలు...అన్నట్టు మరో సంగతి కూడా నర సింహంచెవిని వేయి...'

జగన్నాథం చెప్పాలా, వద్దా అని ఓనిమిషం తటపటాయించారు.

'నాభార్య చనిపోయి పదిసంవత్సరాలైం దని, నేను ఒంటరిగానే వుంటున్నానని చెప్పు...వస్తాను మరి...' అంటూ బ్రిడ్జి దిగసాగారు.

బరువుగా అడుగులువేస్తూ, ఆ చేతి సంచీతో, మూర్తీభవించిన శోకంలా నడచి పోతున్న ఆయన్ని చూడగానే ఆయువకుడి కళ్ళు కూడా అశ్రుపూరితాలయ్యాయి.

